క్లుప్తంగా

నేడు జోనల్‌స్థాయి క్రీడలు

గీసుకొండ: సంగెం, గీసుకొండ మండలాల జోనల్‌స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు జోనల్ కార్యదర్శి పీడీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం గీసుకొండ పాఠశాలలో క్రీడాపోటీలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగంలో అండర్–14, 17 కేటగిరిల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించబడుతాయన్నారు. ఒక్కో క్రీడాంశంలో ఒక్కో పాఠశాల నుంచి ఇద్దరి చొప్పున పంపించాలని కోరారు. ఈ నెల 27, 28వ తేదీల్లో గీసుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆధార్ కార్డు, పుట్టినతేదీ ధ్రువీకరణ ప్రధానోపాధ్యాయులు జారీ చేసి పత్రాలతో సకాలంలో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో రెండు మండలాల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కు వ్యర్థాల రీసైక్లింగ్



సంగెం : మండలంలోని తీగరాజుపల్లిలోని నోటర్ డేమ్ పాఠశాలలో బుధవారం సైన్స్‌ఫేర్ నిర్వహించారు. జూనియర్ విభాగంలో 7వ తరగతి విద్యార్థులు త్రిపుర, కీర్తనలు ప్రదర్శించిన టెక్స్‌టైల్ పార్కులోని వస్త్రాల తయారీ కర్మాగారాల నుంచి విడుదలయ్యే వ్యర్థాలతో జల కాలుష్యం కాకుండా చెరువుల్లోకి వదలకుండా తిరిగి శుభ్రపరుచుకుని ఎలా వాడుకోవడంపై ప్రదర్శించిన ప్రదర్శనకు మొదటి బహుమతిని ప్రిన్సిపాల్ నితీషా అందజేశారు. కార్యక్రమంలో జ్యోతిక పాల్గొన్నారు.

వాగ్దేవి కళా సంస్థ అధ్యక్షుడిగా ప్రదీప్

నల్లబెల్లి : వాగ్దేవి కళా సంస్థ అధ్యక్షుడిగా రఘుసాల ప్రదీప్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంస్థ గౌరవ అధ్యక్షుడు వీరన్న బుధవారం తెలిపారు. ప్రధానకార్యదర్శిగా నవీన్, ఉపాధ్యక్షులుగా శ్రవణ్, స్వామి, కార్యదర్శులుగా ప్రభాకర్, సతీష్, కోశాధికారులుగా వెంకన్న, కోటి, సలహాదారులను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

'మహాలక్ష్మి'ని సద్వినియోగం చేసుకోవాలి



నర్సంపేట రూరల్ : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుచేస్తున్న మహాలక్ష్మి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గురిజాలలో మహాలక్ష్మి పథకం కింద ఎంపికైన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ స్పెషలాఫీసర్, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



నర్సంపేట: పట్టణంలోని మోడల్ స్కూల్(బొందబడి)లో షాటో ఖాన్ కరాటే సంస్థ బుధవారం నిర్వహించిన కరాటే బెల్ట్ టెస్టులో పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ మేరకు సామల శివ, చరణ్‌తేజ, సిద్దార్థ్, రిషి, ఓడెల సుదాంశులు ఎల్లో బెల్ట్ సాధించారు. ఆరెంజ్ బెల్ట్ విభాగంలో కుసుమ మనీష్, అంకాల అభిజ్ఞలు బెల్టులు సాధించగా మనితేజ బ్లూ బెల్టు సాధించాడు. సంస్థ ఇండియా చీఫ్ ఇన్‌స్పెక్టర్ క్యూషి రచ్చ శ్రీనుబాబు బెల్టులు, సంస్థ సర్టిఫికెట్‌లు అందించారు.

ఉపాధ్యాయుల దాతృత్వం



చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థి చిలపాక వినయ్‌కుమార్ రచించిన బతుకమ్మపాట వీడియో చిత్రీకరణ కోసం హైస్కూల్ ఉపాధ్యాయులంతా కలిసి ప్రోత్సాహకంగా రూ.5100, బదిలీపై వెళ్లిన తెలుగు ఉపాధ్యాయురాలు మమత రూ.5వేలు పాటను రచించిన వినయ్‌కి వీడియో చిత్రీకరించడానికి నగదును బుధవారం అందించారు. అనంతరం రచయితగా మున్ముందు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయ, బదిలీపై వెళ్లిన తెలుగు ఉపాధ్యాయురాలు మమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రైతు భరోసా' తక్షణమే అందించాలి

● ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేశ్

నర్సంపేట: రైతుల పెట్టుబడి సాయం కోసం తక్షణమే పది ఎకరాల లోపు సాగుచేసే రైతులందరికీ రైతు భరోసా అమలు చేసి అకౌంట్లలో డబ్బులు జమ చేయాలని, వరి ధాన్యాలకు క్వింటాకు రూ.500 బోనస్ వర్తింప చేయాలని అఖిల భారత రైతు సమాఖ్య(ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఓంకార్ భవన్‌లో బుధవారం రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు వసుకుల మట్టయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి 30 లక్షల ఎకరాల సాగవుతున్న అధిక వర్షాలు, ప్రభుత్వ విధానాలతో రైతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అన్నారు. ఒక వైపు ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోయి, మరో వైపు అధిక వర్షాలతో పంటలు కోల్పోయి ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. ప్రధాన పంటలైన పత్తి, మొక్కజొన్న తీవ్రంగా దెబ్బతిన్నాయని, కేవలం వారి పంట మాత్రమే కొంత ఆశాజనకంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నామని అంటూనే ఆచరణలో కుంటి సాకులతో అమలు చేయడం లేదన్నారు. రైతులు అనేక దశాబ్దాలుగా భూములు సాగు చేసుకుంటూ వారసత్వంగా వస్తున్న భూములను సైతం రికార్డు లోంచి తొలగించి గత ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురి చేసిందన్నారు. సరిచేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నేటికి సరి చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులు పండించిన వరి ధాన్యానికి ఎకరాకు రూ.500బోనస్ ఇస్తామని చెప్పి ప్రభుత్వం సన్నరకం వరి ధాన్యానికే ఇస్తామని అనడం సరైంది కాదన్నారు. రైతాంగ పోరాటాలను ఉధృతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ క్రమంలో అక్టోబర్ 15న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టనున్నట్లు రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు గుండెబోయిన చంద్రయ్య, మహ్మద్ ఇస్మాయిల్, వక్కల కిషన్, సింగతి మల్లికార్జున్, నాగెల్లి కొమురయ్య, కర్ర రవీందర్‌గౌడ్, ప్రభాకర్ రెడ్డి, మారయ్య, అంజయ్య, పెంటయ్య, ఒడ్డే నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంబటి శ్రీనివాస్

నర్సంపేట: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇంటి స్థలాలు కేటాయించాలని టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్,తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పంజాల వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో బుధవారం టీజేఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ మేరకు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, రూ.25వేల పెన్షన్ విధానాన్ని, విద్యా, వైద్యంలో ఉచిత సేవలు అందించాలన్నారు. ఉచిత రవాణా సౌకర్యం, పాసులు, ఉద్యమకారులుగా ప్రభుత్వం నుంచి గుర్తింపు కార్డులు ఇస్తూ వారికి ప్రతి ప్రభుత్వ శాఖలో గుర్తింపు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ ఫలాల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక నాయకులు బుధవారం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్, రాష్ట్ర కమిటీ సభ్యులు గుంటి రామచందర్, బొనగాని రవీందర్, జిల్లా నాయకులు మల్లేషం, సాయికుమార్, ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పంజాల వెంకట్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దికాయల రాంబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపతి లక్ష్మీనారాయణ, రమేష్, సంఘం మహేందర్, శ్రీను, ప్రభాకర్, కళ్యాణ రాముడు, నర్సయ్యగౌడ్, తిరుపతిరెడ్డి, భాస్కర్, రాజు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

నర్సంపేట : వైద్యం పేరుతో పట్టణంలో కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేస్తున్న దోపిడీని అరికట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం పట్టణ కమిటీ సమావేశం గడ్డమీది బాలకృష్ణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి కనీస నిబంధనలను పాటించడం లేదని, ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నాయన్నారు. ఇష్టానుసారంగా పరీక్షలు, స్కానింగ్, అడ్మిట్ పేర్లతో ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఫీజుల వివరాలు నోటీస్ బోర్డులో పెట్టాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ అవి పాటించడం లేదని తెలిపారు. కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ పీఆర్వోలను పెట్టుకుని ఆర్‌ఎంపీల దగ్గరికి వెళ్లి మా ఆస్పత్రులకు మీ దగ్గరకు వచ్చే పేషెంట్లను పంపిస్తే కమీషన్ అందిస్తామని చెప్పి నిలువు దోపిడీ చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఆస్పత్రుల నిర్వహణకు ఉండాల్సిన బిల్డింగ్స్, ఫైర్ సేఫ్టీ, పార్కింగ్ స్థలాలు లేవని, వాహనాలను రోడ్లమీదనే పార్కింగ్ నిర్వహిస్తున్నారన్నారు. అవసరం లేకుండా టెస్టుల పేరుతో అధిక డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఇవన్నీ జరుగుతున్న జిల్లా వైద్యాధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తూ ప్రైవేట్ ఆస్పత్రులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యుడు బాలకృష్ణ, కందికొండ రాజు, నాయకులు కలకోట అనిల్, జగన్నాథం, కార్తీక్, రాజేష్, నరేష్, మల్లయ్య, నర్సింహరాములు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలి



దుగ్గొండి: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన అధికారి, మండల ప్రత్యేక అధికారి సంగీతలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, గ్రామాభివృద్ధి పనుల ప్రణాళికపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య పనులు, ఉపాధి పనులు, కూలీలకు చెల్లించాల్సిన వేతనాలపై సమీక్షించారు. ఎంపీడీఓ లెక్కల అరుంధతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, ఏపీఓ శ్రీనివాస్, పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న రమణారావు

వర్ధన్నపేట: ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీయడంతో పాటు అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పి.రమణారావు అన్నారు. బుధవారం కాంప్లెక్స్ పరిధిలోని డీసీ తండా ప్రాథమికోన్నత పాఠశాల, బావని కుంట ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి పాఠశాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చి దిద్దాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాల నిర్వహణ రికార్డులను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తూ అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఎఫ్‌ఎల్‌ఎస్ సక్రమంగా నిర్వహించాలన్నారు. మధ్యాహ్న భోజన అవకతవకలు జరుగకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

వర్ధన్నపేట: రాష్ట్రవ్యాప్తంగా గత ఆరేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చుక్క శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ నెల 27న(శుక్రవారం) హైదరాబాద్‌లో భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద జరుగబోయే విద్యార్థి మహాగర్జనను విజయవంతం చేయాలని కోరుతూ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతుందని ఇప్పటికైనా ఇచ్చిన హామీ ప్రకారం ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 రాష్ట్రంలో అమలు చేసే ప్రక్రియను వెనక్కి తీసుకోవాలన్నారు. విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కల్యాణ్, మైథిలీ, జ్యోతి, జ్యోత్స్న, తేజ, సంతోష్, అమీర్, నవీన్, మణికంఠ పాల్గొన్నారు.

హింసలేని సమాజస్థాపనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న కూసం రాజమౌళి

సంగెం: మహిళలకు హింసలేని సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని జిల్లా ట్రెనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి అన్నారు. బుధవారం గీసుకొండ మండలం గంగదేవిపల్లిలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంగెం మండలంలోని మహిళా సహాయత కమిటీకి శిక్షణ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకాశంలో సగమైన మహిళలు నేడు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అయినా తమకు వచ్చే సమస్యలను ఎదుర్కోలేక, చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళల సమస్యలకు అనేక చట్టాలున్నాయని వాటిపై అవగాహన పెంచుకుని సమస్యలను అధిగమించాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ కవిరాజ్, సభ్యులు అక్తర్, వనిత మహిళలు పాల్గొన్నారు.

ఆందోళన వీడితే విజయం తథ్యం

గీసుకొండ: విద్యార్థులు పరీక్షలు అనగానే భయంతో ఆందోళన చెందుతారని మానసికాందోళన వీడి లక్ష్యంతో చదివితే విజయం తప్పక వరిస్తుందని మానసిక వైద్యులు డాక్టర్ భరత్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టెలిమనాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అనవసరమైన వాటికి సమయం కేటాయించకుండా సమయపాలనతో కష్టపడి చదువుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.అశోక్‌రావు, పాల్గొన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ అశోక్

నర్సంపేట రూరల్ : ఇటీవల కురుస్తున్న వర్షాలకు పత్తి పంటలో నీరు నిలిస్తే మొక్కలు చనిపోయే ప్రమాదం ఉందని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఏఈఓ మెండు అశోక్ అన్నారు. మండలంలోని గురిజాలలో పత్తి పంటలను బుధవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పత్తిపంటలో అధిక వర్షాలకు ఎండు తెగులు ఆశించే అవకాశాలు ఉన్నాయని, తెగులు వ్యాప్తిని నివారించడానికి సీఓసీ 3 గ్రాములు లేదా కార్బండాజిమ్ 1 గ్రాము లీటర్ నీటిలో కలిపి మొక్కల మొదళ్ల వద్ద పంపు నాజిల్ తీసి తెగులు మొక్కల మొదళ్ల వద్ద పిచికారీ చేయాలన్నారు.

వాటర్ ప్యూరిఫయర్ అందజేత

చెన్నారావుపేట: మండలంలోని కోనాపురం ప్రాథమిక పాఠశాలకు ప్రముఖ బిల్డర్ నలబాల రవికుమార్ ఓఆర్ ప్యూరిఫయర్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సంపాదనలో పది శాతం డబ్బులు పేద విద్యార్థులకు సాయం చేయడం జరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.పాపమ్మ మాట్లాడుతూ ప్యూరిఫయర్ వాటర్ తాగడం వల్ల అనేక జబ్బులు దూరం అవుతాయని తెలిపారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్యూరిఫయర్ వాటర్ ఉంటే విద్యార్థులకు ఎలాంటి జబ్బులు రావని అన్నారు. అనంతరం రవికుమార్‌ను సన్మానించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పూజిరా సురేందర్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సరైన ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలి



మాట్లాడుతున్న సీడీపీఓ మధురిమ

నర్సంపేట: కౌమారదశలో ఉన్న బాలబాలికలు సరైన ఆహారం తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోషణ మాసం సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపల్ మల్లం నవీన్ అధ్యక్షతన ఐసీడీఎస్ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి కిశోర బాలికలే రేపటి బంగారు భవిష్యత్‌కు పునాదులని తెలిపారు. స్త్రీలలో 57 శాతం, పిల్లల్లో 67 శాతం, గర్భిణుల్లో 52 శాతం రక్తహీనత ఉంటుందన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమం ద్వారా ప్రతి సంవత్సరం రెండు శాతం రక్తహీనతను తగ్గించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులచే పోషణ ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో ఏసీడీపీఓ శ్రీదేవి, కృషి విజ్ఞాన కేంద్రం అరుణ్‌జ్యోతి, కౌన్సిలర్ ఓర్సు అంజలి, డాక్టర్ అరుణ్‌చంద్ర, హెల్త్ సూపర్‌వైజర్ రామచంద్రయ్య, డిగ్రీ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ రజిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమ, ఝాన్సీరాణి, మహిళా సాధికారత జిల్లా కో ఆర్డినేటర్ పావని, జెండర్ స్పెషలిస్ట్ హర్షిత, సఖి లీగల్ కౌన్సిలర్ శోభారాణి, నల్ల భారతి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, రాంబాబు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

మంచినీళ్ల చెరువును కాపాడాలి



రాయపర్తి: మండలకేంద్రంలోని మంచినీళ్ల చెరువు పక్కనే ఉన్న సత్యనారాయణ ఫౌల్ట్రీ హాచరీస్ వ్యర్థాలతో కలుషితమవుతుందని గ్రామస్తులు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హాచరీస్ ఎదుట ఆందోళన వ్యక్తం చేయడంతో పాటు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఎస్సారెస్పీ డీఈ కిరణ్‌కుమార్‌ను పిలిపించి చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. హాచరీస్ నుంచి వచ్చే వ్యర్థాలనీరు చెరువులోకి వస్తున్న తీరును పరిశీలింపచేయించారు. హాచరీస్‌ను మూసివేయాలని నినాదాలు చేశారు

ఎంఈఓగా రాము




సంగెం: మండల విద్యాశాఖ అధికారిగా గుగులోత్ రాము పదవీ బాధ్యతలు బుధవారం స్వీకరించారు. ఇక్కడ ఎంఈఓగా పనిచేస్తున్న నక్క విజయ్ కుమార్ ఆత్మకూరుకు బదిలీపై వెళ్లారు. సంగెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడైన రాము గతంలో నెల్లికుదురు ఎంఈఓగా పనిచేసి బదిలీపై సంగెం వచ్చారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓ బాధ్యతల స్వీకరణ


నర్సంపేట రూరల్ : నర్సంపేట ఇన్‌చార్జ్ ఎంఈఓగా పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న కొర్ర సారయ్యను నియమిస్తూ ఆర్‌జేడీ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఎమ్మార్సీలో సారయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కృషి చేస్తానని, పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం సారయ్యను ఎంఎస్ కోఆర్డినేటర్ భరత్, సీఆర్పీలు సునీల్, చంద్రమౌళి, రవీందర్ మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందించారు.

జీపీ సిబ్బందికి 2వ పీఆర్‌సీని వర్తింపజేయాలి



రాయపర్తి: గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ సిబ్బందికి 2వ పీఆర్‌సీని వర్తింపచేయాలని కోరుతూ బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కిషన్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని కోరారు. వేతనాలకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. జీఓ నంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

వనరులను సద్వినియోగం చేసుకోవాలి



సంగెం: ప్రభుత్వ కళాశాలలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన తహసీల్దార్ మాట్లాడుతూ సమాజంలో అనేక రుగ్మతలున్నాయని వాటి బారిన పడకుండా తమ లక్ష్యం వైపు నడవాలన్నారు. ఎస్సై నరేశ్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకుండా నిగ్రహంతో బంగారు భవిష్యత్ వైపు పయనించాలన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

పర్వతగిరి : ధర్మసాగర్‌లోని నీటి శుద్ధీకరణ కేంద్రంలో మెయింటనెన్స్ పనులు, జఫర్‌గఢ్ వద్ద ప్రధాన పైపులైన్ మెయింటనెన్స్ పనుల కారణంగా గురువారం పర్వతగిరిలో నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ గ్రిడ్ సాయిరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 27వ తేదీన నీటి సరఫరా పునరుద్ధరణ జరుగుతుందని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఎఐఎఫ్‌డీఐ సదస్సును జయప్రదం చేయాలి



వర్ధన్నపేట: ఈ నెల 28న వరంగల్‌లో నిర్వహించనున్న అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (ఏఐడీఎఫ్‌ఐ) రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద రవి పిలుపునిచ్చారు. బుధవారం వర్ధన్నపేటలో రాష్ట్రస్థాయి సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం రవి మాట్లాడుతూ ఈ సదస్సులో దేశంలో, రాష్ట్రంలో పాలకవర్గాలు అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాలపైన భవిష్యత్ కార్యాచరణ రూపొందించడానికి సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్రాల నుంచి యువతీ యువకులు హాజరవుతున్నారన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



వెంకట్‌రెడ్డి (ఫైల్)

నెక్కొండ: మండల కేంద్రానికి చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని ఎస్సై మహేందర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. గత ఏడేళ్లుగా చల్లా వెంకట్‌రెడ్డి (45) తాగుడుకు బానిసయ్యాడు. ఈ నెల 24న మద్యం తాగి ఇంటికి వచ్చి వెంకట్‌రెడ్డిని భార్య ప్రమీల మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో తన పంట చేనువద్దకు పోయి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకట్‌రెడ్డి మృతి చెందారని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

అనంతారం గ్రామంలో రైతు..

పర్వతగిరి : మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన బేతి మహేందర్(45) రైతు పురుగుల మందు తాగగా హనుమకొండలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 18న రోజు వారి పనిలో భాగంగా వ్యవసాయ భూమి వద్దకు ఉదయం వెళ్లిన మహేందర్ అప్పుల బాధతో పురుగుల మందు తాగాడు. కాగా హనుకొండలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మహేందర్‌కు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా అతనికి కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు శిరీష వివాహం ఐదేళ్ల క్రితం చేయగా అప్పులు పెరిగిపోయాయి. దీనికి తోడు కుటుంబ ఆర్థికపరిస్థితుల నేపథ్యంలో మరో రూ.1.30 లక్షలు అప్పు చేయగా వాటిని తీర్చడం ఇబ్బందిగా ఉందని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. మూడెకరాల వ్యవసాయ భూమి పంట పెట్టుబడి కోసం అప్పు చేశాడు. అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

రాయపర్తి: నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.స్వరూప తెలిపారు. బుధవారం నిందిలను విలేకరుల ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని జేతురాంతండాలో పది లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్‌ఇన్‌స్పెక్టర్ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవం

నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో ప్రపంచ ఫార్మాసిస్టు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం మండలంలోని మహేశ్వరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పుట్ట రవి, టీపీఓ మనీష్‌కుమార్, విభాగాధిపతులు రవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధితుల కుటుంబాలకు పరామర్శ

వర్ధన్నపేట: మండలంలోని దమ్మన్నపేటలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి, ఒగ్గుల కొమ్మాలు మృతి చెందారు. వారి దశదిన కర్మలో బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, దిలీప్‌రాజ్ పరామర్శించారు.

రాయపర్తి: మండలంలోని ఆరెగూడెంలో బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన వరికేల కర్ణాకర్ కుటుంబ సభ్యులను మాజీ ఎంపీపీ అని మిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ పరామర్శించారు.

నర్సంపేట: పట్టణానికి చెందిన భారతీయ జనతా యువమోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు చిలువేరు అన్వేష్ తండ్రి శంకర్ ఇటీవల మృతి చెందగా బుధవారం దశదినకర్మ నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి రూ.8వేల ఆర్థికసాయం అందజేశారు.

ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

నల్లబెల్లి : బీజేపీ హైందవ రాష్ట్రం సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి బీజేపీ జిల్లా కార్యదర్శి తడుక అశోక్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, వెంకన్న, వినయ్, కోటి పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

చెన్నారావుపేట : స్వచ్ఛత హి సేవా కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ నల్ల శ్రీవాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శ్రమదానంతో బుధవారం శుభ్రం చేశారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే తిమ్మరాయినిపహాడ్‌లో తడిచెత్త పొడి చెత్తపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.